సాక్షి
ములుగు

గురువారం । 21 । నవంబర్ । 2024



లక్నవరం.. పర్యాటకుల స్వర్గధామం

లక్నవరం.. పర్యాటకులకు స్వర్గధామమని, రాష్ట్రాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని మంత్రులు జూపల్లి కృష్ణారావు, ధనసరి సీతక్క అన్నారు. - 8లో ▸



శబరిమలకు స్పెషల్ రైళ్లు..

కాజీపేట జంక్షన్ మీదుగా శబరిమలకు వెళ్లే అయ్యప్ప మాలధారులు, భక్తులకు స్పెషల్ రైళ్ల సర్వీస్‌లు నడిపించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. - 8లో ▸

గరిష్టం/కనిష్టం
28.0⁰ /16.0⁰

వాతావరణం

ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండగా ఉంటుంది. సాయంత్రం నుంచి చల్లగాలులు, రాత్రి పొగమంచుతో చలి తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజనతో భరోసా

ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా

ఏటూరునాగారం : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జీవన జ్యోతి (పీఎంజేజే) బీమా యోజనను అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఈ పథకం పేదలకు భరోసా ఇస్తుందని ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్లనుంచి 50 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఏదైనా బ్యాంక్ లేదా పోస్ట్ ఆఫీస్‌లో ఆధార్‌తో అనుసంధానమైన సేవింగ్స్ ఖాతా కలిగి ఉండాలన్నారు. ఏడాదికి రూ.436లు ప్రీమియం చెల్లించాలని, ఆటోమెటిక్ డెబిట్ సౌకర్యం కూడా ఉంటుందన్నారు. మరణం సంభవిస్తే రూ.2 లక్షలు సాయం వర్తిస్తుంది. అలాగే 18 ఏళ్లనుంచి 70 ఏళ్లలోపు వారు సంవత్సరానికి రూ.20లు ప్రీమియం చెల్లిస్తే మరణం సంభవిస్తే రూ. 2లక్షలు, పాక్షికంగా అంగవైకల్యం కలిగితే రూ.లక్ష బీమా వర్తిస్తుంది. ఈనెల 22వ తేదీన ఐటీడీఏ కార్యాలయంలో ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు పీఓ పేర్కొన్నారు. బీమా కావాల్సిన వారు వారి ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌పుస్తకం, నామిని వివరాలు, బ్యాంక్ అకౌంట్ లింక్ ఉన్న మొబైల్‌ను వెంట తీసుకురావాలని కోరారు.

జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలి



ములుగు : జిల్లాలోని ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించి వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని గిరిజన జర్నలిస్టులు తెలిపారు.ఈ మేరకు ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బానోత్ వెంకన్న ఆధ్వర్యంలో నాయకులు బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర పంచాయతీ రాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా అక్రిడిటేషన్ కమిటీలో ప్రాధాన్యం కల్పించాలని మంత్రికి వినతి పత్రాన్ని అందజేశారు. అలాగే ఐటీడీఏ ద్వారా సంక్షేమ పథకాలలో అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భూక్య సునీల్, పోరిక శరత్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వైద్యశిబిరం



ములుగు రూరల్ : మండలంలోని జంగాలపల్లి గ్రామంలో మూడో రోజు ఉచిత వైద్యశిబిరం కొనసాగింది. ఈ శిబిరంలో పలు వ్యాధులపై జిల్లా వైద్యాధికారి గోపాలరావు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపాల్‌రావు మాట్లాడుతూ ప్రజలు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. బీపీ, షుగర్, మలేరియా, డెంగీ వంటి ఆరోగ్య సమస్యలు ఉంటే శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మూడో రోజు వైద్య బృందాలు గ్రామంలో పర్యటించి, వ్యాధులపై అవగాహన కల్పించారు. బుధవారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో 145 మందికి వైద్యసేవలు, 32 మంది రక్త నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో జిల్లా శిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ రణధీర్, సైక్రియాటిస్ట్ డాక్టర్ నమ్రత, వైశాలి, నవ్య రాణి, ఇన్‌చార్జ్ మాస్ మీడియా అధికారి సంపత్, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ దుర్గారావు, ఎంఎల్‌హెచ్‌పీఎస్ నవ్య, దీపిక, ఆరోగ్య విస్తరణ అధికారి సురేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

పగిలిన పైపులైన్.. ఎగిసిన నీరు



కాటారం: కాటారం మండల కేంద్రానికి సమీపంలో భూపాలపల్లి వైపుగా జాతీయ రహదారిని ఆనుకొని కేటీపీపీకి నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన పైపులైన్ గేట్ వాల్వ్ బుధవారం పగిలిపోవడంతో నీరు ఒక్కసారిగా ఎగిసిపడింది. కాళేశ్వరం సమీపంలోని గోదావరి నుంచి చెల్పూర్ సమీపంలోని కేటీపీపీకి నీటి సరఫరా కోసం గతంలో భారీ పైపులైన్ ఏర్పాటు చేసి అక్కడక్కడ పెద్ద గేట్ వాల్స్ అమర్చారు. నీటి పీడనం కారణంగా మండల కేంద్రానికి సమీపంలో గేట్‌వాల్వ్ పగిలిపోవడంతో పెద్ద ఎత్తున నీరు బయటకు వచ్చింది. సుమారు గంట పాటు నీరు వృథాగా పారింది. సమాచారం అందుకున్న సిబ్బంది నీటి సరఫరాను నిలిపివేశారు.



పశుగణన.. ఆన్‌లైన్ నమోదు

జిల్లాలో 99,459 ఇళ్ల సర్వే
- ఐదేళ్లకోసారి లెక్కింపు.. 16 రకాల పశుజాతుల నమోదు
- 2025 ఫిబ్రవరి నాటికి పూర్తి

ములుగు రూరల్ : గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పశు సంపదకు ఎనలేని ప్రాధాన్యత ఉంది. వ్యవసాయ అనుబంధ రంగాల్లో పశువుల పాత్ర కీలకం. భూ మిలేని అనేక మంది కుటుంబాలకు ప్రాథమిక ఆ దాయ వనరు పశువులే అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ప్రభుత్వం అక్టోబర్ 25 నుంచి 2025 ఫిబ్రవరి 29 వరకు పశు గణన నిర్వహించడానికి పశుసంవర్ధకశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. పశుగణనలో 16 రకాల పశుజాతుల వివరాలు సేకరించనున్నారు. పశుగణనలో భాగంగా తెల్లజాతి పశువులైన ఆవులు, ఎద్దులు, గేదెజాతి పశువులు, గొర్రెలు , మేకలు, పందులు, గుర్రాలు, గాడిదలు, కుక్కలు, పెంపుడు కుక్కలు, ఒంటెలు, పొట్టి గుర్రాలు, కుందేళ్లు, ఏనుగులు, కోళ్ల రకాలను లెక్కించనున్నారు.

ఐదేళ్లకోసారి లెక్కింపు..

పశుగణన 1919వ సంవత్సరంలో ప్రారంభమైంది. అప్పటి నుంచి ప్రతి ఐదు సంవత్సరాలకోసారి పశుగణన లెక్కిస్తున్నారు. ఇప్పటి వరకు 20 సార్లు పశుగణన చేపట్టారు. 2019లో జరిగిన పశుగణనలో జిల్లాలో తెల్లజాతి పశువులు 70,126, గేదెలు 48,109, గొర్రెలు 91,869, మేకలు 56,303, పందులు 585 మొత్తం 2,66,992 నమోదు చేశారు. 21వ పశుగణన నాలుగు నెలల పాటు కొనసాగనుంది. ములుగు జిల్లాలోని తొమ్మిది మండలాలలో మొత్తం 174 గ్రామ పంచాయతీల్లో 99,459 ఇళ్లను సర్వే చేయనున్నారు. 29 మంది పశుగణన కర్తలు, 9 మంది పర్యవేక్షకులు, ఇద్దరు నోడల్ అధికారులు సర్వేలో పాల్గొననున్నారు. పశుగణనతో జిల్లాలో ఏఏ రకాల పశువులు ఉన్నాయనే విషయం తెలవడంతో పాటు వైద్య చికిత్స, సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందుల సరఫరా సులభతరంగా ఉంటుందని అన్నారు. రైతులకు ఆర్థికపరమైన సబ్సిడీ రుణాల అందించడం కోసం, డెయిరీ ఫాం మంజూరు చేసేందుకు ఉపయోగపడుతాయని అన్నారు.

తొలిసారి ఆన్‌లైన్..

పశుగణన గ్రామాలు, పట్టణాలు, డెయిరీ, కోళ్ల, గొర్రెల ఫాం, దేవాలయాలు, గోశాలలు, పశు వైద్యకశాలల్లో సర్వే నిర్వహిస్తారు. ఎన్యుమరేటర్లు జిల్లాలోని అన్ని ఇళ్లను సందర్శించి పూర్తి సమాచారాన్ని తీసుకుంటారు. సర్వే నిర్వహించిన ప్రతి ఇంటికీ స్టిక్కరింగ్ చేస్తారు. పశు పోషణలో ఉన్న రైతులు, కుటుంబాల వివరాలను సేకరించడంతోపాటు పశువుల వయసు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. మొదటిసారి ఆన్‌లైన్‌లో పశుగణన వివరాలను నమోదు చేపడుతున్నారు. సర్వే పారదర్శకంగా నిర్వహిస్తున్నారా.. లేదా.. అంచనా మేరకు నమోదు చేస్తున్నారా.. అనే విషయంపై పశువైద్యాధికారులు, సూపర్‌వైజర్లు వ్యవహరిస్తూ పర్యవేక్షిస్తారు. సర్వే వివరాలను నోడల్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తారు.

పశుగణనకు రైతులు సహకరించాలి



పశుగణనకు రైతులు, ప్రజలు సహకరించాలి. రైతుల ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పశుగణనను చేపడుతోంది. పశుగణన ఆధారంగా జిల్లాలో ఉన్న పశువులకు టీకాలు, వ్యాధి నివారణ మందులు సరిపడా అందేలా చూస్తాం.

- కొమురయ్య, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

ఐలాపురానికి తరలిన అధికారులు



ఐలాపురం సమ్మక్క జాతరపై పూజారులతో మాట్లాడుతున్న పీఓ చిత్రామిశ్రా



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా

- ఒకే రోజు 20 మందితో 209 కుటుంబాల సర్వే
- మినీ మేడారం, ఐలాపురం జాతరపై దృష్టి

ఏటూరునాగారం/కన్నాయిగూడెం : దట్టమైన అటవీ ప్రాంతం..ఐటీడీఏకు 37 కిలోమీటర్ల దూరంలోని గిరిజన పల్లెకు అధికార యంత్రాంగం తరలివెళ్లింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేను జిల్లాలోని కన్నాయిగూడెం మండలం ఐలాపురంలోని 209 కుటుంబాలు బహిష్కరించాయి. సర్వేలో భాగంగా రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉన్న ములుగు జిల్లాలో కేవలం ఒకే ఒక గ్రామస్తులు బహిష్కరించడంతో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. దీంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అధికారులు బుధవారం గిరిజన పల్లెకు పరుగులు పెట్టారు. ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రాతో పాటు జిల్లా, మండల అధికారులు అడవిబాట పట్టారు. ఐలాపురంలోని 209 కుటుంబాలతో పీఓ సమావేశమయ్యారు. ఐలాపురం గ్రామంలో 1983లో దివంగత నేత అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఆశ్రమ పాఠశాలను మంజూరు చేశారని, అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి రోడ్డు మార్గం లేదని మాజీ సర్పంచ్ మల్లెల లక్ష్మయ్య పీఓకు వివరించారు. రోడ్డు సౌకర్యం లేక నానా అవస్థలు పడుతున్నామని గోడు వెల్లబోసుకున్నారు. సర్వే చేయాలి అంటే తమ సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు అధికారులను డిమాండ్ చేశారు. ఈ విషయంపై స్పందించిన పీఓ గ్రామంలో ఉన్న సమస్యలను, రోడ్డు మార్గం ఏర్పాటుకు మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు సర్వే చేసేందుకు అంగీకరించారు. దీంతో 20 ఎన్యుమేటర్లతో ఒకే రోజు సర్వే చేసి ముగించారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన

ఐలాపురంలో సమ్మక్క-సారలమ్మ జాతర వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరుగుతుందని, జాతరకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించాలని గ్రామస్తులు కోరారు. జాతరకు సిరివంచ నుంచి వచ్చే భక్తులకు అడవిమార్గంలో దారిని చదును చేయించాలని, గద్దెల వద్ద విద్యుత్ దీపాలు, తాగునీటి వసతి, మరుగుదొడ్లు, ఆర్చీ నిర్మాణం, ఇతర సౌకర్యాలు కల్పించాలని పూజారులు, గ్రామస్తులు కోరారు. ఈమేరకు పీఓ ఇక్కడ కావాల్సిన ఏర్పాట్లను ముందుగా గుర్తించి నివేదిక ఇవ్వాలని ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ వీరభద్రంను ఆదేశించారు. అలాగే మినీ మేడారం జాతరకు వచ్చే భక్తుల కోసం అడవిమార్గంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులు, అటవీ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా పనిచేయాలన్నారు. అనంతరం ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థుల సౌకర్యాలు, బోధన, భోజనాన్ని పీఓ పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ వీరభద్రం, తహసీల్దార్ వేణు, ఎంపీడీఓ అనిత, స్పెషల్ ఆఫీసర్ ఏపీడీ వెంకటనారాయణ, ఎంపీఓ సాజీదాబేగం, ఆర్అండ్‌బీ డీఈఈ కుమారస్వామి, పెసా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్, అటవీశాఖ అధికారులు, ఎస్‌డీసీ డీటీ అనిల్, జీసీడీఓ సుగుణ, సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాలల హక్కుల రక్షణ అందరి బాధ్యత

జిల్లా సంక్షేమ అధికారి శిరీష



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న శిరీష తదితరులు

ములుగు : జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ బాలికల పాఠశాలలో ప్రపంచ బాలల హక్కుల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా సంక్షేమ అధికారి శిరీష, ఎంపీడీఓ రామకృష్ణ హాజరై మాట్లాడుతూ విద్యార్థులకు ప్రపంచ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ, రాష్ట్రస్థాయిలో వివిధ రంగాల్లో నిలిచిన చిన్నారులు జిల్లా బాలల పరిరక్షణ విభాగం ద్వారా పురస్కారాలు అందుకోవడం జరుగుతుందన్నారు. బాలలు సమాజానికి అమూల్యమైన సంపద అని వారందరు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల బాలికలు ఎలాంటి వివక్షకు గురికాకుండా బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన బాలల హక్కుల పరిరక్షణ చట్టాలపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీపీయు సోషల్ వర్కర్ జ్యోతి, ఓఆర్‌డబ్ల్యూ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జోనల్ క్రీడా పోటీల్లో బాలికల ప్రతిభ

అభినందించిన ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు



క్రీడాకారులను అభినందిస్తున్న నర్మదబాయి

ములుగు రూరల్ : జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో ములుగు సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల విద్యార్థినులు పతకాల సాధించి, పలు క్రీడలలో ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించి, రాష్ట స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ నర్మద బాయి, ఉపాధ్యాయులు బుధవారం పాఠశాల ఆవరణలో ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ నెల 11 నుంచి 14 వరకు లక్షెట్టిపేటలో కాళేశ్వరం 10వ జోనల్ స్థాయి గురుకుల పాఠశాల క్రీడా పోటీలు జరిగాయి. ఈ క్రీడల్లో ములుగు సాంఘిక సంక్షేమ పాఠశాల బాలికలు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, వివిధ క్రీడా అంశాలలో స్వర్ణ పతకాలు-8, రజత -2, కాంస్య -2 సాధించి ఓవరాల్ చాంపియన్ షిప్, అండర్-19 కబడ్డీలో రన్నరప్, చెస్ స్వర్ణం, అండర్-14లో టెన్నికాయిట్‌లో రన్నరప్‌గా నిలిచి, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని, క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు స్నేహభావం ఏర్పడుతుందని, మరింత ప్రతిభ కనబరిచి పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆమె అన్నారు. కార్యక్రమంలో స్వాతి, త్రివేణి, శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ఏటూరునాగారం/ములుగు రూరల్ : జిల్లాలోని గిరిజన భవన్‌లో 68వ అండర్-17 బాలబాలికల ఉమ్మడి వరంగల్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) కరాటే సెలక్షన్ పోటీలు నిర్వహించారు. మంగళవారం రాత్రి జరిగిన ఈ పోటీల్లో ఏటూరునాగారం కరాటే క్లబ్‌కు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబర్చినట్లు కరాటే అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎండీ అబ్బు తెలిపారు. ఈ పోటీల్లో ఏటూరునాగారం గ్రామానికి చెందిన సీహెచ్ ఐశ్వర్య, కె.శ్రీహరిణి, అలువాల విష్ణుశ్రీ, విశాల్, గణేశ్, హర్షవర్ధన్, అన్వేష్, దినేష్, చరణ్, రూమేశ్ బంగారు పతకాలు సాధించి రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కి ఎంపికయ్యారని ఆయన పేర్కొన్నారు. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్-14లోపు విభాగంలో బాలబాలికల బాక్సింగ్ ఎంపిక పోటీలు హనుమకొండలోని జేఎన్ఎస్‌లో నిర్వహించారు. ఏటూరునాగారం (మల్లంపల్లి) తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి రాజేష్ బాక్సింగ్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా డీఈఓ పాణిని హాజరై విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు. పీడీ శ్రీధర్, పీఈటీ ప్రశాంత్, అంకయ్య, వాసుదేవ్, రహీం పాషా, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, శోభన్‌బాబు, తిరుపతి, హేమాద్రి పాల్గొన్నారు.

కాళేశ్వరాలయంలో భక్తుల పూజలు



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని కాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. కార్తీకమాసం సందర్భంగా గర్భగుడిలో ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. అనంతరం ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేకంగా దీపారాధనలు చేశారు.

బదిలీలకు సబ్ రిజిస్ట్రార్ల ఎదురుచూపులు

- అక్టోబర్‌లో ఓడీ పేరిట 19 మంది ట్రాన్స్‌ఫర్
- 20 మందితో మరో జాబితా రెడీ
- సొంత జిల్లాకు పోతామంటూ అభ్యర్థనలు



కాజీపేట అర్బన్: రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్‌శాఖలో బదిలీలు ఎప్పుడంటూ సబ్ రిజిస్ట్రార్లు ఎదురుచూస్తున్నారు. జూలై 31వ తేదీన జీరో ట్రాన్స్‌ఫర్స్ పేరిట రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్‌శాఖ ఐజీ, ప్రభుత్వం ప్రకటించిన బదిలీల ఉత్తర్వులతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని అటెండర్‌స్థాయి నుంచి జిల్లా రిజిస్ట్రార్ వరకు బదిలీ అయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జోన్‌లో భాగంగా జోన్-1 బదిలీల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఉమ్మడి వరంగల్‌కు గ్రేడ్-1, గ్రేడ్-2 సబ్ రిజిస్ట్రార్‌లతోపాటు జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ఏకకాలంలో జూలై 31వ తేదీన బదిలీల ప్రకటన, ఆగస్టు 1న జాయినింగ్‌లతో పూర్తిగా నూతన అధికారులతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు మారిపోయాయి.

ఓడీ పేరిట అక్టోబర్‌లో మరో జాబితా

సాధారణ, లాంగ్ స్టాండింగ్ బదిలీలకు బదులుగా కొత్తగా రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖలో అక్టోబర్ 15న ఓడీ (ఆన్ డ్యూటీ) పేరిట బదిలీలకు శ్రీకారం చుట్టారు. ఇందులో జోన్‌లను దాటి హైదరాబాద్ వరకు ట్రాన్స్‌ఫర్స్ అయ్యాయి. గ్రేడ్-1, గ్రేడ్-2 సబ్ రిజిస్ట్రార్లు 19 మందికి స్థాన చలనం కలిగింది. రెండు నెలల గడువులోనే మరో కార్యాలయానికి బదిలీకావడంతో ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు.

20 మందితో మరో జాబితా..

'మా జిల్లాకు మేము పోతాం. మాకు చాలా దూరమవుతుంది' అంటూ సబ్ రిజిస్ట్రార్లు ఇటీవల రెవెన్యూశాఖ మంత్రిని కలిసి వినతిపత్రం అందించినట్లు సమాచారం. ఇప్పటికే ఓడీ పేరిట 19 మంది గ్రేడ్-1, గ్రేడ్-2 సబ్ రిజిస్ట్రార్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడగా, ఇదే కోవలో మరో 20 మందితో జాబితా సిద్ధమైనట్లు సమాచారం. నవంబర్ చివరి వారంలో లేదా డిసెంబర్ మొదటి వారంలో బదిలీ జాబితా వెలువడే అవకాశం ఉంది. దీంతో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకునేందుకు సబ్ రిజిస్ట్రార్లు పావులు కదుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

లాంగ్ లీవ్‌లో పలువురు..

ఉమ్మడి వరంగల్ నుంచి ఖమ్మం, ఖమ్మం నుంచి వరంగల్‌కు బదిలీపై వచ్చిన గ్రేడ్-1,గ్రేడ్-2 సబ్ రిజిస్ట్రార్లు తాము ఇంత దూరం ప్రయాణం చేయలేమని, ఈ కార్యాలయాల్లో పని చేయలేమంటూ కొందరు, గ్రూప్స్ ప్రిపేర్ అవుతున్నామని మరికొందరు లాంగ్ లీవ్ పెట్టారు. కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సీనియర్ అసిస్టెంట్లు సబ్ రిజిస్ట్రార్లుగా విధులు నిర్వహిస్తున్నారు. చిట్స్ విభాగంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

పులి ఉన్నట్టా.. లేనట్టా?

పలిమెల : మండలంలోని కామన్‌పల్లి -ముకునూరు రహదారిలోని కిష్టాపురం పహాడ్ వద్ద పెద్ద పులి సంచరిస్తుందని మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి తెలిపిన సమాచారం మేరకు మంగళవారం ఉదయం నుంచి అటవీశాఖ అధికారులు గాలింపు చేపట్టారు. బుధవారం తిరిగి గాలింపు చేపట్టినట్లు ఎఫ్ఆర్ఓ నాగరాజు తెలిపారు. కాగా ఇప్పటి వరకు ఎలాంటి పెద్ద పులి ఆనవాళ్లు, పాదముద్రలు గుర్తించలేదని తెలిపారు. నేడు (గురువారం) కూడా గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. అయితే అధికారులు ఎలాంటి నిర్ధారణ చేయకపోవడంతో పులి ఉందా.. లేదా అని స్థానికుల్లో సందిగ్ధం నెలకొంది.

నియామకం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కొరిపల్లి ప్రశాంత్ జాతీయ మానవహక్కుల మండలి ఎన్జీఓ తెలంగాణ నార్త్‌జోన్ అధ్యక్షుడిగా బుధవారం ఎన్నికయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మానవ హక్కుల మండలి ఎన్జీఓ జాతీయ అధ్యక్షుడు అయిలినేని శ్రీనివాస్‌రావుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

రేవంత్‌రెడ్డి చీటర్, బ్రోకర్..



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి, పక్కన శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు

- అబద్ధాలు, మోసపూరిత మాటలతో అధికారంలోకి..
- సీఎం హోదాలో ఏమి మాట్లాడుతున్నావో సోయి ఉందా?
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

హన్మకొండ: సీఎం రేవంత్ రెడ్డివి చిల్లర మాటలని, ఆయనొక చీటర్, బ్రోకర్ అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తూర్పారబట్టారు. బుధవారం హనుమకొండ రాంనగర్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో కేసీఆర్ అనే మొక్కను మొలవనివ్వవా.. గంజాయి మొక్కలాంటి నిన్ను పీకి అవతల పారేస్తామన్నారు. అబద్ధాలు, మోసపూరిత మాటలతో అధికారంలోకి వచ్చి సీఎం అయ్యావన్నారు. 'నన్ను రాక్షసుడన్నావు.. అవును నేను రాక్షసుడినే. పని చేసే రాక్షసుడిని.. నా ప్రజల కోసం ఏమైనా చేస్తా' అని అన్నారు. నీ మాటలు నమ్మి ఓటేసిన ప్రతీ ఒక్కరిని మోసం చేశావన్నారు. సీఎం హోదాలో ఏమీ మాట్లాడుతున్నావో సోయి ఉందా అని ప్రశ్నించారు. విజయోత్సవ సభలు పెట్టుకోవడం కాదు.. నమ్మి ఓటేసిన ప్రజల సమస్యలు పట్టించుకో అని హితవు పలికారు. నాడు సోనియాను బలిదేవత అని, నేడు దేవత అని ఆమె కాళ్లు కడిగి నీళ్లు చల్లుకుంటానని మాట్లాడడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కేసీఆర్ వల్లే కాళోజీ కళాక్షేత్రం అద్భుతంగా నిర్మితమైందన్నారు. శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ ఇందిర మహిళా శక్తి విజయోత్సవ సభ వంచన సభ అని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ దుర్మార్గంగా మాట్లాడారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ ముఖ్యమంత్రి 5 ఏళ్లు కొనసాగలేదని, రేవంత్ రెడ్డికి కౌంట్ డౌన్ ప్రారంభమైందన్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ విజయోత్సవ సభలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు చేస్తున్నట్లు ప్రకటిస్తారని ఆశించిన వారికి భంగం కలిగిందని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి, అతడి అనుచరులు చిల్లర మాటలు బంద్ చేయాలన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, గండ్ర వెంకటరమణారెడ్డి, నన్నపునేని నరేందర్ మాట్లాడారు. సమావేశంలో గిరిజన సహకార సంస్థ మాజీ చైర్మన్ గాంధీ నాయక్, నాయకులు పాల్గొన్నారు.

ఆ.. మాటలు సీఎం పదవికే అవమానం

- ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని విమర్శించే అర్హత రేవంత్‌కు లేదు
- బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ



మాట్లాడుతున్న బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావుపద్మ, పక్కన నేతలు మార్తినేని, గంట

హన్మకొండ: రేవంత్ రెడ్డి మాటలు సీఎం హోదాకే అవమానకరమని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. బుధవారం హనుమకొండ హంటర్ రోడ్‌లోని వేద బాంక్వెట్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని విమర్శించే అర్హత సీఎం రేవంత్ రెడ్డికి లేదన్నారు. ఇరువురిపై రేవంత్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. పార్లమెంట్ ఎన్నికల్లో 14 స్థానాల్లో గెలుస్తామని అబద్ధాలు ప్రచారం చేసినా ప్రజలు బీజేపీని 8 స్థానాల్లో గెలిపించారన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు 8 స్థానాలు మాత్రమే వచ్చాయన్నారు. కాజీపేటకు వ్యాగన్ పరిశ్రమ మంజూరు చేసి ఇప్పుడు దీనిని కోచ్ ఫ్యాక్టరీగా అప్‌గ్రేడ్ చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాజీపేటకు ఇచ్చిన కోచ్ ఫ్యాక్టరీని తరలించుకుపోయిందని విమర్శించారు. వరంగల్ మహానగర అభివృద్ధి పనులన్నీ కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో చేసిన అభివృద్ధి పనులపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీని తెలంగాణ ద్రోహి అంటే నాలుక చీరుస్తామన్నారు. కిషన్ రెడ్డిని గుజరాత్‌కు వెళ్లు అంటున్న రేవంత్.. మీరు ఇటలీకి పోతారా అని ప్రశ్నించారు. బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ మాట్లాడుతూ కాకతీయుల గడ్డ ఓరుగల్లుకు స్మార్ట్ సిటీ, అమృత్, హృదయ్ పథకాలు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఇచ్చిన ఘనత ప్రధాని మోదీది అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీని ఆదరించడం చూసి ఓర్వలేక చిల్లర విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి భాష మార్చుకో అని హితువు పలికారు. నోటి దురుసు మంచిది కాదన్నారు. సమావేశంలో నాయకులు డాక్టర్ పెసరు విజయ్ చందర్‌రెడ్డి, డాక్టర్ కాళీ ప్రసాద్, ఎర్రబెల్లి ప్రదీప్ రావు, గుజ్జ సత్యనారాయణ రావు, కొలను సంతోశ్ రెడ్డి, జయంత్ లాల్, కొండి జితేందర్ రెడ్డి, జనగామ శ్రీనివాస్, చల్ల జయపాల్ రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటే ప్రజలే తరిమికొడతారు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, పక్కన ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

- ఉమ్మడి జిల్లాకు వేల కోట్ల నిధులు
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: 'ఉమ్మడి వరంగల్ జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి రూ. వేల కోట్ల నిధులు మంజూరు చేస్తే ఏం తెచ్చారని కొందరు అజ్ఞానులు అడుగుతున్నారు.. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునే ద్రోహులను ప్రజలే తరిమికొట్టే రోజులొస్తాయి' అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండలోని డీసీసీ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయోత్సవసభతో ఉమ్మడి వరంగల్ జిల్లా కొత్త రూపం దాల్చబోతుందన్నారు. గత ప్రభుత్వం రూ.50 కోట్ల నిధులుంటే రూ.200 కోట్ల పనులకు శంకుస్థాపన చేసిందన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించేందుకు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో అభివృద్ధి పనులకు టెండర్లను పిలిస్తే కమీషన్లకు కక్కుర్తి పడే నాయకుల తీరుతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదన్నారు. అది మరిచిన కొందరు మీడియా సమావేశం పెట్టి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చదువుకున్న అజ్ఞాని అన్నారు. జీఓలను చదివే కనీస జ్ఞానం లేదన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు తమ జీవిత కాలంలో తీసుకురాలేనన్ని నిధులు ప్రజాప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చారన్నారు. గత ప్రభుత్వం నోటిఫికేషన్లతో సరిపెడితే కాంగ్రెస్ సర్కారు పరీక్షలు నిర్వహించి ఉద్యోగాలు కల్పించిందన్నారు. నాడు సీఎం రేవంత్ ఇచ్చిన హామీ ప్రకారం ఎయిర్‌పోర్టు భూసేకరణ, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి నిధులు కేటాయించారన్నారు. పదేళ్లు భూకబ్జాలతో నగరాన్ని భ్రష్టుపట్టించిన దొంగలు నేడు మాట్లాడడం సిగ్గు చేటన్నారు. సమావేశంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, పరకాల, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, డీసీసీ వరంగల్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కార్పొరేటర్లు పోతుల శ్రీమన్నారాయణ, విజయశ్రీరజాలి, నాయకులు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కూచన రవళి పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి

పలిమెల : ఈతకు వెళ్లి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని సర్వాయిపేటలో చోటు చేసుకుంది. ఎస్సై తమాషారెడ్డి కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన ఆకుదారి ప్రశాంత్ (17) మిత్రులతో కలిసి మంగళవారం గోదావరి నదిలోకి ఈతకు వెళ్లాడు. అయితే ప్రశాంత్‌కు ఈత రాకపోవడంతో నీటిలో మునిగి ఎంతకూ పైకి తేలలేదు. దీంతో మిత్రులు.. ప్రశాంత్ గల్లంతైన విషయం కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో వారు స్థానికుల సాయంతో గాలింపు చర్యలు చేపట్టగా బుధవారం సాయంత్రం మృతదేహం లభ్యమైంది. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మహదేవ్‌పూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించనున్నట్లు ఎస్సై తమాషారెడ్డి తెలిపారు.

సాంకేతిక లోపంతో నిలిచిన గూడ్స్

డోర్నకల్: డోర్నకల్ మీదుగా విజయవాడ వైపునకు వెళ్తున్న గూడ్స్ రైలులో సాంకేతిక లోపం తలెత్తి మెయిన్ లైన్‌లో నిలిచింది. దీంతో బుధవారం పలు రైళ్లు ఆలస్యంగా నడిచాయి. గూడ్స్ డోర్నకల్ నుంచి బయలుదేరి పాపటపల్లి స్టేషన్ సమీపిస్తుండగా రైలులో సాంకేతిక సమస్య తలెత్తి మెయిన్‌లైన్‌లో నిలిచింది. దీంతో డోర్నకల్ నుంచి విజయవాడకు వెళ్తున్న కృష్ణా ఎక్స్‌ప్రెస్ బుగ్గవాగు సమీపంలో, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ డోర్నకల్ స్టేషన్‌లో నిలిచాయి. మరో ఇంజిన్‌ను పంపి మెయిన్‌లైన్‌లో నిలిచిన గూడ్స్‌ను పాపటపల్లి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సుమారు 1.20 గంటల పాటు నిలిచిన కృష్ణా ఎక్స్‌ప్రెస్, డోర్నకల్‌లో అరగంట నిలిచిన ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌ను ఖమ్మం వైపునకు పంపారు.

లక్నవరం.. పర్యాటకుల స్వర్గధామం



మూడో ద్వీపంలోని 'ద కావ్ ఫ్రీ కోట్స్' రిసార్ట్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు



రిసార్ట్‌లోని స్విమ్మింగ్ పూల్ ఎదుట మంత్రులు జూపల్లి, సీతక్క

- అందుబాటులోకి మూడో ద్వీపం
- రాష్ట్రాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం
- మంత్రులు జూపల్లి కృష్ణారావు, ధనసరి సీతక్క

గోవిందరావుపేట : లక్నవరం.. పర్యాటకుల స్వర్గధామమని, రాష్ట్రాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నారని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం బుస్సాపూర్ గ్రామం లక్నవరం జలాశయంలో రూ. 7 కోట్ల వ్యయంతో మూడు ఎకరాల విస్తీర్ణంలో టీజీటీడీసీ, ఫ్రీకోట్స్ సంస్థ సంయుక్త భాగస్వామ్యంతో అభివృద్ధి చేసిన మూడో ద్వీపాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ పర్యాటక శాఖ కొత్త పుంతలు తొక్కుతోందన్నారు. రామప్ప, లక్నవరం లాంటి సరస్సులు ఉండడంతోపాటు దేశంలోని అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన సమ్మక్క–సారక్క జాతర ములుగు జిల్లాకు గుర్తింపు తెచ్చిపెడుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక ప్రదేశాలను సుందరంగా తీర్చిదిద్దుతామని, పర్యాటకుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతులకు పెద్ద పీట వేస్తామన్నారు. ఐలాండ్ అనుభూతి పొందేందుకు అండమాన్, మాల్దీవులు లాంటి సుందర ప్రదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా తెలంగాణలో కూడా అలాంటి టూరిజం స్పాట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. కనుచూపు మేర నీరు.. చుట్టూ పచ్చని కొండల మధ్యలో 12 దీవులతో ప్రకృతి అందాలను కలబోసుకున్న లక్నవరానికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కుమార్ కేంద్రం ప్రభుత్వం రూ. 100 కోట్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పర్యాటక శాఖ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో పర్యాటక ప్రాంతాన్ని ఏ మాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి ప్రారంభంకానున్న పార్లమెంట్ సమావేశాల్లో పర్యాటక ప్రాంతాలకు నిధులు కేటాయించాలని కోరుతామన్నారు. కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాశ్ రెడ్డి, కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ డాక్టర్ శబరీశ్ పాల్గొన్నారు.

నవోదయలో ప్రవేశాలకు మరో అవకాశం..

- 9,11వ తరగతుల్లో ఖాళీలు
- ఈనెల 26వ తేదీలోపు దరఖాస్తులకు ఆహ్వానం



మామునూరు జవహర్ నవోదయ విద్యాలయం

ఖిలా వరంగల్: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించేందుకు కేంద్ర ప్రభుత్వం వరంగల్ మామునూరులో జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాట చేసింది. ఇందులో ఏటా 6వ తరగతిలో ప్రవేశాలకు ప్రకటన విడుదల చేస్తూ ప్రవేశాలు స్వీకరిస్తోంది. అయితే ప్రస్తుతం 2025–26 సంవత్సరానికి సంబంధించి 9,11వ తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి నోటిఫికేషన్ వెలువరించింది. ఖిలా వరంగల్ మండలం మామునూరు జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతిలో ప్రవేశాలకు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుతం 8వ తరగతి చదువుతూ ఉండాలి. 11వ తరగతిలో ప్రవేశాలకు ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న వారే దరఖాస్తు చేసుకోవాలి. 9వ తరగతిలో ప్రవేశాలకు 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు మే 1, 2010 నుంచి జూలై 31, 2012 మధ్య జన్మించిన వారు, 11వ తరగతిలో ప్రవేశాలకు 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు జూన్ 1, 2008 నుంచి జూలై 31, 2010 మధ్య జన్మించి ఉండాలని ప్రిన్సిపాల్ తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు నవంబర్ 26వ తేదీలోపు httpr:llcbreitmr.nic.in2024nvrix వెబ్‌సైట్, లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 08, 2025న జరగనుంది.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



నవోదయలో ప్రవేశాల కోసం విద్యార్థులకు మరో అవకాశం కల్పించాం. దీనిని సద్వినియోగం చేసుకోవాలి. ప్రణాళికాప్రకారం పరీక్షకు సన్నద్ధమై ఉత్తీర్ణత సాధించాలి.

– బి.పూర్ణిమ, నవోదయ ప్రిన్సిపాల్, మామునూరు

లైబ్రేరియన్‌పై దాడి.. యువకుడి అరెస్ట్

- 10 గ్రాముల బంగారు ఆభరణం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ పార్థసారథి



మాట్లాడుతున్న ఏసీపీ పార్థసారథి

జనగామ: జనగామ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లైబ్రేరియన్ భూక్యా ఉపేందర్‌పై దాడి చేసి బంగారు చైన్ ఎత్తుకెళ్లిన యువకుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ పార్థసారథి తెలిపారు. ఈ మేరకు బుధవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్సై భరత్‌తో కలిసి విలేకరులకు వివరాలు వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లా బక్కరుప్పుల తండాకు చెందిన కేలోత్ సాయికృష్ణ గత నెల14వ తేదీన ఏదైనా ఉద్యోగం చేయడానికి జనగామ జిల్లా కేంద్రానికి వచ్చాడు. ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్న సమయంలో అడ్మిషన్ లేకుండా ఇక్కడ ఉండొద్దని హాస్టల్ వార్డెన్ పంపించాడు. దీంతో పీజీ అడ్మిషన్ కోసం ఈ నెల4వ తేదీన ఏబీవీ డిగ్రీ కళాశాలకు వెళ్లాడు. ఆ సమయంలో లైబ్రరీ అనారోగ్యంగా ఉన్నట్లు గుర్తించాడు. ఈ క్రమంలో చోరీ చేస్తే సులువుగా డబ్బులు సంపాదించొచ్చనే ఆలోచనతో ఈ నెల5వ తేదీన డిగ్రీ కళాశాల లైబ్రేరియన్ రాగానే అతడిపై దాడికి పాల్పడి మెడలో ఉన్న 10 తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లాడు. ఈ ఘటనపై సీఐ దామోదర్ రెడ్డి, ఎస్సై భరత్, సిబ్బంది విశ్వసనీయ సమాచారం మేరకు బాలాజీనగర్‌లోని విజయ లాడ్జిలో ఉన్న సాయికృష్ణను అదుపులోకి తీసుకుని విచారించారు. నేరం అంగీకరించగా రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ పార్థసారథి తెలిపారు.

దొంగలను పట్టుకుని బంగారం రికవరీ చేస్తాం



బ్యాంకు వద్దకు చేరుకున్న బంగారం దాచుకున్న బాధితులు





ఎస్‌బీఐ వద్దకు చేరుకుంటున్న సీపీ, గ్యాస్ కట్టర్‌తో కట్ చేసిన బ్యాంకు లాకర్

- వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా
- చోరీకి పాల్పడింది ప్రొఫెషనల్ గ్యాంగే..
- బ్యాంకు ఎదుట ఖాతాదారుల ఆందోళన

రాయపర్తి : త్వరలోనే దొంగలను పట్టుకుని బంగారాన్ని రికవరీ చేస్తామని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఘటనా స్థలికి చేరుకున్నారు. చోరీ జరిగిన తీరును పరిశీలించారు. కాగా బ్యాంకుపై భరోసాతో లాకర్లలో దాచుకున్న తమ బంగారాన్ని దొంగలు దోచుకువెళ్లడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొందని ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 18వ తేదీ రాత్రి నుంచి 19 తేదీ తెల్లవారు జామున దొంగలు వరంగల్ జిల్లా రాయపర్తి మండలకేంద్రంలోని ఎస్‌బీఐ భవనం కిటికీని తొలగించి లోపలికి చొరబడిన 19కిలోల బంగారు ఆభరణాలు దోచుకెళ్లిన ఘటన విధితమే. ఈ సందర్భంగా డీసీపీలు రాజమహేంద్రనాయక్, షేక్ సలీమా, ఏసీపీ నర్సయ్యతో కలిసి సీపీ ఘటనా స్థలిని పరిశీలించారు. చోరీ జరిగిన విషయంపై అధికారులతో చర్చించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ ఎస్‌బీఐ లాకర్‌లోని 19 కిలోల బంగారు ఆభరణాలను గ్యాస్ కట్టర్ సాయంతో కోసి చోరీకి పాల్పడింది వాస్తవమేనన్నారు. ఇది ప్రొఫెషనల్ గ్యాంగ్ పనే అని తెలిపారు. క్లూస్ టీంతో అన్ని ఆధారాలను సేకరిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాసరావు, ఎస్సైలు శ్రవణ్‌కుమార్, రామ్‌చరణ్, రాజు తదితరులు ఉన్నారు.

అధికారులు ఏం చెప్పడం లేదు

మాది రాయపర్తి మండలకేంద్రం. 13తులాల బంగారాన్ని ఎస్‌బీఐలో తనఖా పెట్టి రూ.4.10లక్షల అప్పు తీసుకున్నా. తీరా బంగారం దొంగలు ఎత్తుకెళ్లారని తెలిసి బాధగా ఉంది. బ్యాంకుకు వచ్చి అడుగుదామనుకుంటే అధికారులు ఏం చెప్పడంలేదు. మా బంగారాన్ని మాకు ఇప్పించాలి.

– ఎండీ మన్నన్, రాయపర్తి

బ్యాంకు అధికారులు సమాధానం చెప్పడం లేదు

ఎస్‌బీఐపై నమ్మకంతో బంగారు ఆభరణాలను లాకర్‌లలో దాచుకున్నామని, బ్యాంకు పక్కన ఇళ్లు లేకపోవడంతోపాటు సెక్యూరిటీ గార్డును ఏర్పాటు చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేశారని ఖాతాదారులు ఆరోపించారు. ఇప్పటి వరకు బ్యాంకు అధికారులు తమకు ఎలాంటి సమాధానం ఇవ్వకపోవడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రానికి చివరన బ్యాంకు ఏర్పాటు చేయడం.. పక్కన జనావాసాలు లేకపోవడం దొంగలకు ఆవాసంగా మారిందన్నారు. బ్యాంకు పక్కన ముళ్లచెట్లు ఏపుగా పెరిగి నిర్మానుష్య ప్రదేశం ఉండడం వల్లే చోరీ జరిగిందన్నారు. నిర్లక్ష్యం వహించిన బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకోవాలని ఖాతాదారులు డిమాండ్ చేస్తున్నారు.

కాజీపేట మీదుగా శబరిమలకు స్పెషల్ రైళ్లు..

- మౌలాలి–కొల్లం మధ్య 12 సర్వీసులు
- రేపటి నుంచి ప్రారంభం..

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ మీదుగా కేరళలోని శబరిమలకు వెళ్లే అయ్యప్ప మాలధారులు, భక్తుల సౌకర్యార్థం మౌలాలి –కొల్లం మధ్య ప్రత్యేక రైళ్ల సర్వీసులు నడిపించనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం తెలిపారు.

ప్రత్యేక రైళ్ల సర్వీసుల వివరాలు..

మౌలాలి–కొల్లం ప్రత్యేక రైలు: ఈనెల 22, 29, డిసెంబర్ 6,13,20,27వ తేదీల్లో మౌలాలి–కొల్లం (07143) ఎక్స్‌ప్రెస్ ప్రతి శుక్రవారం మౌలాలిలో 11.30 గంటలకు బయలుదేరి కాజీపేట జంక్షన్‌కు 13.28 గంటలకు చేరుకుంటుంది. కొల్లంకు శనివారం రాత్రి 7.00 గంటలకు చేరుతుంది.

కొల్లం–మౌలాలి: కొల్లం–మౌలాలి (07144) ఎక్స్‌ప్రెస్ ఈనెల 24, డిసెంబర్ 1,8, 15, 22, 29వ తేదీల్లో కొల్లంలో ఆదివారం తెల్లవారుజామున 02.30 గంటలకు బయలుదేరి సోమవారం ఉదయం 06.03 గంటలకు కాజీపేటకు చేరుకుంటుంది. 10.00 గంటలకు మౌలాలికి చేరుతుంది.

హాల్టింగ్ స్టేషన్లు..

చర్లపల్లి, భువనగిరి, జనగామ, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు జంక్షన్, రేణిగుంట, కట్‌పడి జంక్షన్, జోలర్‌పెట్టి, సెలం జంక్షన్, ఈరోడ్ జంక్షన్, తిరుప్పూర్, కోయంబత్తూరు జంక్షన్, పాల్క్కడ్ జంక్షన్, త్రిషూర్, అలువ, ఎర్నాకులం టౌన్, ఇట్టుమనూర్, కొట్టాయం, చెంగనసెర్రిచ తిరువల్ల, చెంగనూర్, కాయన్‌కులం జంక్షన్ స్టేషన్‌లో హాల్టింగ్ కల్పించారు.

కేటీఆర్ ధర్నాను అడ్డుకుంటాం..

- ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర
- ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

మహబూబాబాద్ రూరల్ : బీఆర్‌ఎస్ హయాంలో గిరిజనుల నుంచి బలవంతంగా లాక్కున్న భూములను వారికి తిరిగి ఇచ్చిన తర్వాతే బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి రావాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రునాయక్, ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. ఈ మేరకు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ లగచర్ల ఘటన వెనుక బీఆర్‌ఎస్ కుట్ర ఉందన్నారు. ఖబడ్దార్ కేటీఆర్.. మానుకోటలో ధర్నా ఎలా చేస్తారో చూద్దాం, ఇక్కడి నుంచి తరిమికొడుతామన్నారు. మానుకోటలో అభివృద్ధి పేరిట గిరిజనులు సాగుచేసుకుంటున్న భూములను లాక్కున్నారని, పరిహారంకూడా ఇవ్వలేదన్నారు. మెడికల్ కళాశాల భూముల విషయంలో పోరాడినందుకు వార్డు కౌన్సిలర్ బానోత్ రవిని హత్య చేయించారన్నారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ భూ కబ్జాలు చేసిన సమయంలో కేటీఆర్, ప్రస్తుత ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు ఎటుపోయారని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ నేతలు కబ్జాలు చేసిన ప్రభుత్వ భూములన్నీ ప్రభుత్వ పరం చేస్తామన్నారు. కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. మృతిచెందిన వార్డు కౌన్సిలర్ బానోత్ రవినాయక్ భార్య పూజ మాట్లాడుతూ మెడికల్ కళాశాల భూముల విషయంలో తన భర్తను మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ చంపించాడని, నాడే రెండు రూ. కోట్లు, కారు ఇస్తామని చెప్పారన్నారు. సమావేశంలో అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, కేసముద్రం, మానుకోట ఏఎంసీల చైర్మన్లు ఘంట సంజీవరెడ్డి, ఇస్లావత్ సుధాకర్, ఎండీ.ఖలీల్, అంబటి వీరభద్రం, బండి శ్రీను, గునిగంటి కమలాకర్, నీరుటి లక్ష్మీనారాయణ, చిట్టెం వెంకన్న, ఎదల్ల యాదవరెడ్డి, శంతన్ రామరాజు, గుగులోత్ రాములునాయక్, అరెందుల వెంకటేశ్వర్లు, గుగులోత్ వెంకట్, భూక్య విజయ, చలమల్ల నారాయణ, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు శ్రీను, హరిసింగ్, విజయమ్మ, జగన్, తదితరులు పాల్గొన్నారు.

లగచర్ల బాధితులకు న్యాయం జరగాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్

మహబూబాబాద్: లగచర్ల బాధితులకు న్యాయం జరగాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. లగచర్ల ఘటనకు సీఎం రేవంత్‌రెడ్డి పూర్తి బాధ్యత వహించాలని, బాధితులకు న్యాయం జరిగేవరకూ పోరాటం చేస్తామన్నారు. లగచర్ల గిరిజన రైతులను ఇబ్బందిపెట్టి 28 మందిని అరెస్ట్ చేశారని, వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి వీధి రౌడీలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్‌ను మొలక అని సీఎం మాట్లాడడం సరికాదన్నారు. తెలంగాణ ఉన్నంత వరకు కేసీఆర్ చరిత్ర ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ ఈనెల 21న స్థానిక తహసీల్ కార్యాలయం ఎదుట జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎంపీ, పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత మాట్లాడుతూ ఫార్మా కంపెనీ పేరుతో గిరిజనులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ మాట్లాడారు. మానుకోట మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకన్న, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ బిందు, నాయకులు భరత్‌కుమార్ రెడ్డి, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, రావుల రవిచందర్‌రెడ్డి, రవికుమార్, యాళ్ల మురళీధర్‌రెడ్డి, ఎడ్ల వేణుమాధవ్, కన్నా, జె. వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.